

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 18-03-2025 | సంపుటి - 21 | సంచిక - 326 | రూ : 4 | పేజీలు: 8


## జాన్.ఎఫ్ కెన్నడీ హత్య కేసు రహస్యాలు.. నేడు వెల్లడి

- : ట్రంప్



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ హత్య కేసుకు సంబంధించిన దస్త్రాలను ఈ రోజు విడుదల చేయనున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. తన యంత్రాంగం ఆ దస్త్రాలను ప్రజల ముందు ఉంచుతుందని తెలిపారు. వాషింగ్టన్‌లోని కెన్నడీ పేరు మీదున్న కళల ప్రదర్శన వేదిక అయిన కెన్నడీ సెంటర్‌ను ట్రంప్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కెన్నడీ హత్యకు సంబంధించి అన్ని దస్త్రాలను నేడు బయటపెడుతున్నట్లు మీడియా ఎదుట ట్రంప్ వెల్లడించారు. గత జనవరిలో ట్రంప్ రెండో సారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక పలు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ, మాజీ సెనేటర్ రాబర్ట్ ఎఫ్.కెన్నడీ, పౌర హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించిన దస్త్రాలను బహిర్గతం

తరువాయి 2లో




## బీసీ రిజర్వేషన్ల బిల్లులకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

- 42% సాధించేవరకు విశ్రమించబోమన్న సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రం ఆమోదించాలని ప్రధానికి లేఖ
- మద్దతు కోసం అఖిలపక్షంతో కలుస్తామని విన్నపం
- నేడు సభలో చర్చకు

### రానున్న ఎస్సీ వర్గీకరణ బిల్లు

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులకు తెలంగాణ శాసనసభ సోమవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సమావేశమైన సభలో మొత్తం ఐదు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తెలంగాణ వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డు కులాలు, తెగలకు విద్యాసంస్థల్లో సీట్లు, రాష్ట్ర సర్వీసుల్లో

తరువాయి 2లో

## పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం

- 5 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం
- జూన్ 2న లబ్ధిదారుల జాబితా
- అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని నడపలేం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 'రాజీవ్ యువ వికాసం' పథకం ప్రారంభం

హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తేనే ప్రజలకు తమపై నమ్మకం కలుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రూ.6 వేల కోట్లతో 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ఈ పథకం ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సోమవారం సాయంత్రం అసెంబ్లీ ఆవరణలో యువ వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఉప ముఖ్య మంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "చదువుకుని చైతన్యం ఉన్నవారికి రూ.4 లక్షల వరకూ ఈ పథకం కింద ఇస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికి

తరువాయి 2లో




## రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ...



- 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన అమలు
- ఏ, బీ, సీ.. మూడు కేటగిరీలుగా రిజర్వేషన్
- రెల్లి, ఉపకులాలకు 1%
- మాల, ఉపకులాలకు 7.5 శాతం
- మాదిగ, ఉపకులాలకు 6.5%..
- మంత్రుల సంఘం సిఫారసుల్ని ఆమోదించిన క్యాబినెట్
- 20న అసెంబ్లీలో చర్చ.. తీర్మానం
- తదుపరి జాతీయ ఎస్సీ కమిషన్‌కు నివేదన
- బేడ, బుడగ జంగాలను రెల్లి కేటగిరీలో చేర్చే ప్రతిపాదన

2లో



అమరావతి, తిరుపతిల్లోనూ

## లులు మాల్స్!

- * ఆ సంస్థ సానుకూలంగా ఉందని సీఎం వెల్లడి
- * విద్యార్థుల స్టార్టప్ సంస్థలకు ఆర్థిక సాయం
- * రాజధానిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్
- * మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

2లో

## రక్షణ భాగస్వామ్యం బలోపేతం

- భారత్, న్యూజిలాండ్ ప్రధానుల ఉద్ఘాటన
- మోదీతో క్రిస్టోఫర్ లక్సాన్ భేటీ

దిల్లీ: రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుని సంస్థాగతపరచుకోవాలని భారత్, న్యూజిలాండ్ నిర్ణయించుకున్నాయి. మనదేశ పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సాన్ సోమవారం ప్రధాని నరేంద్రమోదీతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విద్య, క్రీడలు, వ్యవసాయం, వాతావరణ మార్పుల వంటి రంగాలకు

తరువాయి 2లో





## రేపు భూమి మీదకు సునీతా విలియమ్స్

కేప్ కెనావెరాల్: వ్యోమనౌక మొరాయించడంతో దాదాపు 9 నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ తిరుగుప్రయాణానికి ముహూర్తం ఖరారైంది. మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు (భారత కాలమానం ప్రకారం) పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థనాసా సోమవారం

తరువాయి 2లో



## సుప్రీం న్యాయమూర్తిగా జస్టిస్ జోయ్‌మల్యా ప్రమాణం

దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం చేయించారు. జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ఇప్పటివరకూ కలకత్తా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగారు. ఆయన నియామకంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 33కు చేరింది. జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ఆరేళ్లకు పైగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగనున్నారు. ఆ వ్యవధిలో ఆయన సీజేఐగా పదోన్నతి పొందే అవకాశం ఉంది.

## ఏపీ సహా 4 రాష్ట్రాల ఎంపీలకు రాష్ట్రపతి తేనీటి విందు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, హరియాణాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఉదయం తేనీటి విందు ఇచ్చారు. ప్రస్తుతం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో వివిధ రాష్ట్రాల ఎంపీల గౌరవార్థం విడతలవారీగా ఏర్పాటుచేస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పుడు ఈ నాలుగు రాష్ట్రాల ఎంపీలను ఆహ్వానించారు. ఇందులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ, సహాయ మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, ఎల్.మురుగన్, హరియాణాకు చెందిన కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ నుంచి కె.రామ్మోహన్‌నా

తరువాయి 2లో



(మొదటిపేజీ తరువాయి)

4 వేల నుంచి 5 వేల మందికి పని కల్పించవచ్చు. అయితే, ఐదంతస్తుల భవనం ఉన్నవారికి ఈ పథకం వర్తింప జేస్తామంటే కుదరదు. గతంలో అలా చేసినవారు ఎక్కడున్నారో మీరు చూశారు. అర్హులైన నిరుద్యోగులకు ఈ పథకం అందాలి.

*** ఆర్థికంగా చాలా ఇబ్బందులున్నాయి...**

ఆర్థికంగా చాలా ఇబ్బందులున్నందువల్ల ప్రజలకు వాస్తవాలను వివరించి దుబారాను తగ్గించాలని కార్యాచరణ నిర్ణయించుకున్నాం. ప్రభుత్వ ఆదాయంపై వేసిన అంచనాలు తప్పాయి. అబద్ధాల పునాదులపై ఎన్ని రోజులు ప్రభుత్వాన్ని నడుపుతాం. భారాస పాలనలో పన్నులు సరిగ్గా వసూలు చేయలేదు. ఆదాయం పెంపు గురించి పట్టించుకోలేదు. మేం 14 నెలలుగా గత ప్రభుత్వ విధానంలోనే ఇసుకపై పన్ను వసూలు చేశాం. గత నెల రోజులుగా నేను గట్టిగా దృష్టి పెడితే రోజువారీ ఆదాయం రూ.కోటిన్నర నుంచి రూ.మూడున్నర కోట్లకు పెరి గింది. రాష్ట్ర పన్నుల వసూళ్లలో 88 శాతంతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా.. మహారాష్ట్ర రెండో స్థానంలో ఉంది. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ 6 లేదా 7వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో సింథటిక్ డ్రగ్స్, కొకైన్ ఎక్కువయ్యాయి. తెలంగాణ సమాజాన్ని అవి భయపెడుతున్నాయి. రాష్ట్రం వేగంగా పంజాబ్‌లా మారిపోతోంది. ఉద్యోగం, ఉపాధి లేక యువత వీటికి బానిసలవుతున్నారు. రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకుని.. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలి. ఐటీఐల్లో అడ్వాన్స్డ్ శిక్షణ కేంద్రాలు ప్రారంభించాం. వీటిలో శిక్షణ పొందినవారికి యువ వికాసంలో ప్రాధాన్యమివ్వాలి. ముస్లిం మైనారిటీలకు వారి వాటా మేరకు పథకాల్లో సముచిత న్యాయం చేస్తాం.

# పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం

*** ఆరోపణలు లేకుండా బదిలీలు చేపట్టాం**

ఆరోపణలు రాకుండా కలెక్టర్‌ను బదిలీ చేయగలం కానీ, ఒక్క టీచర్‌ను కూడా బదిలీ చేయలేం. అన్ని శాఖల్లో ఏళ్లుగా పేరుకుపోయిన బదిలీలను మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎలాంటి ఆరోపణలు రాకుండా చేపట్టాం. 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చాం. 36 వేల మందిని బదిలీ చేశాం. కులగణన చేయడం వల్లే ఎమ్మెల్సీలుగా బలహీనవర్గాలకు చెందిన ఐదుగురు ఎన్నికయ్యారు. ఇది తొలి అడుగు మాత్రమే. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల జాబితాను జూన్ 2న ప్రకటిస్తాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

*** జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ: భట్టి**

రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు జూన్ 2న ఆర్థిక సాయం మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడించారు. యువ వికాసం పోర్టల్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు సమర్పించాలని నిరుద్యోగులకు ఆయన సూచించారు. ''గత ప్రభుత్వ హయాంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని ధర్నాలు చేసే పరిస్థితి ఉండేది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేయడం వల్ల పోటీ పరీక్షలకు ఒకేసారి సిద్ధం కావడం ఇబ్బందిగా ఉందని, నోటిఫికేషన్ల మధ్య కొంచెం విరామం ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేసేలా విరివిగా నోటిఫికేషన్లు ఇచ్చే పరిస్థితి తెచ్చాం'' అని ఆయన పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని, హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కోరారు.

# బీసీ రిజర్వేషన్ల బిల్లులకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

నియామకాలు 2025, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 2025 బిల్లులు రెండింటినీ కలిపి సభలో చర్చించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. వీటిపై చర్చించిన అనంతరం అన్ని పక్షాలు ఆమోదం తెలిపాయి. ఈ బిల్లులను శాసనమండలి ఆమోదించిన అనంతరం (బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన) పార్లమెంట్ ఆమోదానికి పంపనున్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సోమవారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం తెలపాలని, అఖిలపక్షంతో వచ్చి కలిసేందుకు అనుమతించాలని అందులో విన్నవించారు.

*** మరో మూడు బిల్లులు...**

ఈ రెండు బిల్లులతో పాటు.. మరో మూడు బిల్లులను సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సవరణ బిల్లు 2025ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశపెట్టగా.. విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చుతూ బిల్లును సభ ఆమోదించింది. తెలంగాణ షెడ్యూల్డు కులాల బిల్లు (ఎస్సీ వర్గీకరణ) 2025, తెలంగాణ ధార్మిక హిందూ మత సంస్థల ధర్మాదాయములు 2025 బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వీటిపై మంగళవారం సభ చర్చించనుంది.

*** ఏకాభిప్రాయానికి ధన్యావాదాలు: సీఎం**

అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగాలు, ఉన్నత విద్య కోర్సుల్లో సీట్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేవరకు.. దాన్ని సాధించేవరకు విశ్రమించేదిలేదని తెలిపారు. ఏ వివాదాలకూ తావు లేకుండా బీసీలకు న్యాయం చేయడమే తమ విధానమన్నారు. అన్ని పార్టీల నేతలు బీసీలకు రిజర్వేషన్ పెంపుపై జెండాలు, ఎజెండాలు, సిద్ధాంతాలను పక్కనబెట్టి ఏకాభిప్రాయం తెలియజేసినందుకు ధన్యావాదాలు చెబుతున్నానన్నారు. బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు అన్ని పార్టీల వారు కలిసికట్టుగా ఉన్నామని సమాజానికి మంచి సంకేతం ఇచ్చారని ప్రశంసించారు.

*** రాహుల్‌గాంధీ హామీ మేరకు కులగణన**

''బీసీలకు రిజర్వేషన్ పెంపుపై కాంగ్రెస్ పార్టీ గతేడాది కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించింది. దానికి కట్టుబడి ఉన్నాం. మా పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ 150 రోజులపాటు 4 వేల కి.మీ. పాదయాత్ర చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో కులగణన చేసి 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారమే రాష్ట్రంలో కులగణన జరిపాం. కొందరు పాల్గొనలేదని చెబితే మళ్లీ అవకాశం ఇచ్చాం. బీసీ కులగణన ప్రక్రియ ప్రారంభించిన ఫిబ్రవరి 4వ తేదీని ఏటా సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించాం.

*** గత బిల్లును ఉపసంహరించు కుంటున్నాం**

గత ప్రభుత్వం 2017లో బీసీలకు 37 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపింది. దాన్ని గవర్నర్.. రాష్ట్రపతి పరిశీలనకు పంపారు. అది అక్కడ పెండింగ్‌లో ఉన్నప్పుడు మరో చట్టం చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. అందుకే దాన్ని ఉపసంహరించుకుంటున్నాం. మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది. ఉమ్మడి ఏపీలో దాన్ని 29 శాతానికి పెంచారు. ఇప్పుడు ఏ వివాదాలకు తావు లేకుండా 42 శాతానికి పెంచి బీసీలకు న్యాయం చేయడమే మా విధానం.

*** త్వరలోనే అందరం ప్రధాని వద్దకు వెళదాం**

పార్లమెంటులో ఆమోదం పొందితేనే రిజర్వేషన్ పెంపు అమలవుతుంది. అందుకే శాసనసభ నాయకుడిగా కేసీఆర్‌కు, భాజపా నేతలకు విజ్ఞప్తి చేస్తున్నా. అందరం కలిసి ప్రధాని వద్దకు వెళ్లి రిజర్వేషన్ పెంపును సాధించుకుందాం. అందుకు నేను నాయకత్వం వహిస్తా. ఇప్పటికే 100కిపైగా రాజ్యాంగ సవరణలు చేసుకున్నాం. అందరం కలిసికట్టుగా వెళ్తే ఇది కూడా ఎందుకు సాధ్యం కాదు? ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కోరుతున్నా. అపాయింట్‌మెంట్ కోరుతూ ప్రధానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశిస్తున్నా. బండి సంజయ్‌కు కూడా లేఖ కాపీ పంపండి. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని కలిసి విన్నవించేందుకు సమయం తీసుకునే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అప్పగిస్తున్నా. ప్రస్తుత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే రిజర్వేషన్ పెంపును ఆమోదించేలా చేసుకుందాం. రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని సుప్రీంకోర్టు ఎందుకు అంటుందంటే.. 50 శాతం దాటాలంటే అందుకు సరైన లెక్కలు ఉండాలి. కులాలవారీగా జనాభా లెక్కలు చెప్పకుండా రిజర్వేషన్ ఎలా పెంచుకుంటారని సర్వోన్నత న్యాయస్థానం అడుగుతోంది. రాష్ట్రంలో చేసిన కులగణన లెక్కలు సరైనవేనని హామీ ఇస్తున్నా. రాష్ట్రంలో మొత్తం 56.36 శాతం మంది బీసీలున్నారు. వారికి 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లు పెట్టాం. దాన్ని సాధించేవరకు విశ్రమించేది లేదు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**కేంద్రం ఆమోదం తెలపాలి**

తెలంగాణలో స్థానిక సంస్థలతో పాటు విద్యఉద్యోగ రంగాల్లో వెనకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుదలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. సంబంధిత రెండు బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని, దీనికి కేంద్రం మద్దతు కోసం కాంగ్రెస్, భారాస, భాజపా, మజ్లిస్, సీపీఐ పార్టీల నాయకులతో ప్రధానిని కలిసేందుకు అనుమతించాలని విన్నవించారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. ''తెలంగాణవ్యాప్తంగా సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కులగణనపై ఇంటింటా సమగ్ర సర్వే ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించింది. సర్వేలో సేకరించిన డేటాను అధ్యయనం చేసిన అనంతరం దాని ఆధారంగా ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రెండు బిల్లులను ప్రవేశపెట్టాం. వీటికి అన్ని పార్టీల నుంచి సంపూర్ణ మద్దతు, ఆమోదం లభించాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం మద్దతు అవసరమనే అభిప్రాయం వ్యక్తమైంది. మీ మద్దతు కోసం ఐదు పార్టీల ప్రతినిధి బృందంతో మిమ్మల్ని కలిసేందుకు వీలైనంత త్వరగా అనుమతించాలని కోరుతున్నాను'' అని రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

*** సాంఘిక విప్లవానికి తెలంగాణ నాయకత్వం**

భారతదేశంలో సాంఘిక విప్లవానికి తెలంగాణ నాయకత్వం వహిస్తున్నందుకు గర్విస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ''జనాభాలో తమ కులగణన జరగాలని, గుర్తింపు పొందాలనే వెనుకబడిన తరగతులకు చెందిన మా సోదరసోదరీమణుల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది. తెలంగాణ శాసనసభ నాయకుడిగా, ముఖ్యమంత్రిగా.. రాష్ట్రంలో ఓబీసీల జనాభా 56.36 శాతం ఉన్నట్లు నేను సాధికారికంగా ప్రకటిస్తున్నా. ఓబీసీలకు విద్య, ఉద్యోగాలు, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించుకున్నాం. చరిత్రకు సంఘీభావంగా.. చరిత్రాత్మక ఘటనలో సరైన ఛాంపియన్‌లుగా నిలుద్దాం'' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సీ వర్గీకరణను 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేయాలని మొదట భావించింది. అయితే జిల్లాల విభజన తర్వాత కొత్త జిల్లాల్లో ఎస్సీల జనాభాపై కచ్చితమైన సమాచారం లేనందున రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. 2026 జనాభా గణన తర్వాత వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేసే విషయాన్ని పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి అమలు చేయనున్నారు. ఏ కేటగిరీలో రెల్లి, ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్.. బీ కేటగిరీలో మాదిగ, ఉపకులాలకు 6.5 శాతం.. సీ కేటగిరీలో మాల, ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్‌ను ప్రతిపాదిస్తూ రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. విద్య, ఉద్యోగ నియామకాల్లో 200 రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించింది. కమిషన్ నివేదికపై అధ్యయనానికి నియమించిన మంత్రుల సంఘం చేసిన సిఫారసుల్ని రాష్ట్ర మంత్రిమండలి సోమవారం ఆమోదించింది.

**సుదీర్ఘ చర్చ తర్వాత..**

వర్గీకరణ అమలుపై మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. హోం మంత్రి అనిత, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అభిప్రాయాలను తీసుకున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల పెండింగ్, ఎస్సీ ఉపప్రణాళిక నిధుల కేటాయింపులో జాప్యం, తదితర అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాత ప్రస్తుతానికి రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఏక సభ్య కమిషన్ నివేదికపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చించనున్నారు. బేడ, బుడగ జంగాలను రెల్లి కేటగిరీ కింద చేర్చే అంశంపై కూడా అదే రోజు చర్చిస్తారు. వీటిపై తీర్మానాలు చేసి, జాతీయ ఎస్సీ కమిషన్‌కు నివేదిస్తారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశముంది.

**'జిల్లా యూనిట్'కే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మొగ్గు**

ఎస్సీ వర్గీకరణ అమలుపై సోమవారం ఉదయం అసెంబ్లీ ఆవరణలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎస్సీ ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. వారిలో ఎక్కువ మంది జిల్లా యూనిట్‌గా వర్గీకరణ అమలు చేయాలని కోరారు. సాయంత్రం మంత్రివర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును ఎస్సీ ప్రజాప్రతినిధులు కలిసి అభినందించారు. వర్గీకరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మీడియాతో చెప్పారు.

# అమరావతి, తిరుపతిల్లోనూ లులు మాల్స్!

అమరావతి: విశాఖతో పాటు అమరావతి, తిరుపతిల్లోనూ మాల్స్ ఏర్పాటుకు లులు సంస్థ సానుకూలంగా ఉంది. విశాఖలో లులు మాల్ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ఆమోదముద్ర వేసింది. అమరావతి, తిరుపతిల్లోనూ మాల్స్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థను కోరామని, సానుకూలంగా స్పందించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. 201419 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం కృషితో విశాఖలో లులు మాల్ ఏర్పాటుకు అంతా సిద్ధమైంది. సాగరతీరంలో ప్రభుత్వం స్థలం కేటాయించింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక స్థలాన్ని లాక్కుని, ఆ సంస్థను వెళ్లగొట్టింది. ఆ చేదు అనుభవంతో ఏపీలో ఇంకెప్పుడూ పెట్టుబడులు పెట్టబోమని అప్పట్లో లులు సంస్థ ప్రతినబూనింది. కూటమి అధికారంలోకి వచ్చాక.. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో మళ్లీ రాష్ట్రానికి వచ్చేందుకు లులు అంగీకరించింది. విశాఖలో మాల్ ప్రతిపాదనకు ఇటీవల రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమ్మతి తెలియజేసింది. దానికి కేబినెట్ ఇప్పుడు ఆమోదముద్ర వేసింది.

*** రాజధాని పనుల పునఃప్రారంభానికి ప్రధానిని ఆహ్వానించనున్న సీఎం**

రాజధాని అమరావతి నిర్మాణ పనుల్ని ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు మంత్రివర్గానికి ముఖ్యమంత్రి తెలిపారు. ఆయనను ఆహ్వానించేందుకు మంగళవారం సాయంత్రం దిల్లీ వెళ్తున్నట్టు చెప్పారు. రాజధానిలో చేపట్టబోయే వివిధ పనులకు కేబినెట్ ఆమోదముద్ర వేసిన సందర్భంగా.. అమరావతి ఏ విధంగా స్వయం సమృద్ధి ప్రాజెక్టో ముఖ్యమంత్రి వివరించారు. ఇప్పటి వరకు ఎన్ని పనులకు టెండర్లు పిలిచారు, నిధుల సమీకరణ తదితర అంశాల్ని అధికారులు మంత్రివర్గానికి తెలియజేశారు. దిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానితో పాటు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా సీఎం కలవనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాలు, కార్యక్రమాల కింద రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న నిధుల జాబితాను తీసుకెళుతున్నారు. ఆ నిధుల్ని వెంటనే విడుదల చేయాల్సిందిగా కోరనున్నారు.

*** పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు..**

విద్యారంగంపై చర్చ సందర్భంగా.. ఉపాధ్యాయుల బదిలీల్ని ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా బదిలీలు విధానం ప్రవేశపెడితే ఎలా ఉంటుందన్న చర్చ జరిగినట్టు తెలిసింది. దానిపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందిస్తూ... కొన్నిచోట్ల మూడు తరగతులకు కలిపి ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని, అలాంటప్పుడు పనితీరు ఆధారంగా బదిలీలు ఇప్పట్లో సాధ్యం కాదని స్పష్టంచేసినట్టు సమాచారం. రాబోయే రోజుల్లో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశాక, అప్పుడు కూడా సాధ్యాసాధ్యాలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే దానిపై ఒక నిర్ణయం తీసుకోగలమని ఆయన పేర్కొన్నట్టు తెలిసింది.

*** సౌర ఫలకాల తయారీలో స్వయం సమృద్ధి సాధించేందుకే..**

ఇండోసోల్ సంస్థకు సౌర ఫలకాల ఉత్పత్తి పరిశ్రమ ఏర్పాటుకి అనుమతివ్వడంపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. రాష్ట్రంలోను, దేశంలోని ఇతర ప్రాంతాల్లోను భారీ ఎత్తున సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటవుతున్నందున రాబోయే రోజుల్లో సౌర ఫలకాలకు చాలా డిమాండ్ ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నట్టు సమాచారం. చైనా నుంచి సౌర ఫలకాల దిగుమతుల్ని నిలిపివేసినందున.. ఆ రంగంలో స్వయంసమృద్ధి సాధించేందుకే ఇండోసోల్ వంటి భారీ సౌరఫలకాల పరిశ్రమకు అనుమతిచ్చామని ఆయనవివరించినట్టు తెలిసింది.

*** విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు స్టార్టప్ ఫండ్..**

స్టార్టప్ పాలసీకి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. విద్యార్థులు ప్రారంభించే స్టార్టప్ సంస్థల్ని ప్రోత్సహించేందుకు, ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు స్టార్టప్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. స్టార్టప్‌ను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు సాయం అందించే అవకాశం ఉంది. రాజధాని అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను, ఐదు ప్రాంతీయ కేంద్రాల్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటు చేస్తారు.

# ఏపీ సహా 4 రాష్ట్రాల ఎంపీలకు రాష్ట్రపతి తేనీటి విందు

(మొదటిపేజీ తరువాయి)

యుడు, కర్ణాటక నుంచి కేంద్ర మంత్రులు ప్రహ్లాద్‌జోషి, శోభా కరంద్లాజే, వి.సోమన్న, తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆ పార్టీ ఉభయసభల సభ్యులు, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, ఎంపీ సీఎం రమేశ్, వైకాపా లోక్‌సభాపక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి, ఆ పార్టీ ఉభయసభల సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ప్రతి ఎంపీ వద్దకు రాష్ట్రపతి వచ్చి మర్యాదపూర్వకంగా పలకరించి యోగక్షేమాలు కనుక్కున్నారు.

# రక్షణ భాగస్వామ్యం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి ఆరు ఒప్పందాలపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. ముఖ్యంగా రక్షణ రంగంలో, ఇండోపసిఫిక్ ప్రాంతంలో సహకార విస్తృతిపై వీరిద్దరూ చర్చించుకున్నారు. రక్షణరంగ పరిశ్రమల సహకారాన్ని పెంచుకునే మార్గసూచీ రూపొందించుకోవాలని నిర్ణయించుకున్నారు. కొందరు సంఘవిద్రోహ శక్తులు న్యూజిలాండ్‌లో భారత వ్యతిరేక, ఖలిస్థాన్ అనుకూల కార్యకలాపాలకు పాల్పడుతుండటంపై మోదీ ఆందోళన వ్యక్తంచేశారు.

**విస్తరణవాదం వద్దు.. అభివృద్ధి ముద్దు**

స్వేచ్ఛాయుత, సురక్షితమైన, సుసంపన్నమైన ఇండోపసిఫిక్ ప్రాంతానికి రెండు దేశాలూ సహకరించనున్నాయని మోదీ తెలిపారు. తాము విస్తరణవాదాన్ని కాకుండా అభివృద్ధి విధానాన్ని విశ్వసిస్తామని పేర్కొన్నారు. సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించే ఇండోపసిఫిక్‌కు తాము మద్దతు ఇస్తామని నేతలిద్దరూ పునరుద్ఘాటించారు. సమగ్ర, పరస్పర ప్రయోజనకర, భారీస్థాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై చర్చలు ప్రారంభం కావడాన్ని మోదీ, లక్సాన్ సంయుక్త ప్రకటనలో స్వాగతించారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, అతివాదాలకు వ్యతిరేకంగా సహకరించుకోవాలని, అలాంటి శక్తులపై కఠిన చర్యలు చేపపట్టాలని మోదీ చెప్పారు. పాడి పరిశ్రమ, ఆహార శుద్ధి, ఔషధ రంగాల్లో పరస్పర సహకారాన్ని, పెట్టుబడులను పెంపొందించుకోనున్నట్లు తెలిపారు.

# రేపు భూమి మీదకు సునీతా విలియమ్స్

(మొదటిపేజీ తరువాయి)

- ప్రకటించింది. వీరి క్రూ డ్రాగన్ వ్యోమనౌక.. ఫ్లోరిడా తీరానికి చేరువలో సాగర జలాల్లో దిగుతుందని వివరించింది.
- భారత కాలమానం ప్రకారం సునీత తిరుగు పయనం ఇలా..
- క్రూ డ్రాగన్ వ్యోమనౌక హ్యాచ్ మూసివేత: మంగళవారంఉదయం 8.15కు మొదలవుతుంది.
- అంతరిక్ష కేంద్రం నుంచి విడిపోవడం: ఉదయం 10.15 గంటలకు ప్రారంభం.
- భూవాతావరణంలోకి పునఃప్రవేశం కోసం ఇంజిన్ల ప్రజ్వలన: బుధవారం తెల్లవారుజామున 2.41 గంటలకు.
- సాగర జలాల్లో ల్యాండింగ్: తెల్లవారుజామున 3.27 గంటలకు.
- సహాయ బృందాలు రంగంలోకి దిగి.. క్రూ డ్రాగన్‌ను వెలికితీస్తాయి.
- ఈ కార్యక్రమాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8:15 గంటల నుంచి ఇది ప్రారంభమవుతుంది.
- ల్యాండింగ్ తర్వాత వ్యోమగాములను హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలిస్తారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దీర్ఘకాల అంతరిక్షయాత్ర తర్వాత వారి శారీరక స్థితిని పరిశీలిస్తారు. భూ గురుత్వాకర్షణ శక్తికి తిరిగి సర్దుబాటు అయ్యేలా నిపుణులు వారికి తోడ్పాటు అందిస్తారు.

# జాన్.ఎఫ్ కెన్నడీ హత్య కేసు రహస్యాలు.. నేడు వెల్లడి: ట్రంప్

(మొదటిపేజీ తరువాయి)

చేయాలంటూ గత జనవరి 23న ఆదేశాలు జారీ చేశారు. కెన్నడీ హత్య జరిగి ఇప్పటికే 60 ఏళ్లకు పైనే అవుతోంది. అయినా ఆయన హత్యకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. గతంలో పలుమార్లు కెన్నడీ హత్యకు సంబంధించి దస్త్రాలు బయటపెడతానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో సైతం ప్రస్తావన తెచ్చారు. ఈ నేపథ్యంలోనే సదరు రికార్డులను విడుదల చేయబోతున్నారు. అయితే ఆ పత్రాల్లో ఎలాంటి సమాచారం ఉందనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. భారీ సంఖ్యలో మాత్రమే పత్రాలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. చదవడానికి చాలా సమయం పడుతుందని మీడియాతో అన్నారు.

# విజయవంతంగా ముగిసిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెల 13వ తారీకు నుండి 17వ తారీకు వరకు నిపుణ్ టెస్టింగ్ క్యాంపు ను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, తెలంగాణ స్టేట్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధికారులు కవితానాయుడు జి.ఎం. వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఎస్ సి సి ఎల్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ డాక్టర్ చింత శారద, సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ , పీజీ కళాశాల ప్రిన్సిపల్, డిస్ట్రిక్ట్ కమీషనర్ గైడ్ ల పర్యవేక్షణలో డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్, చిల్డ్రన్స్ పార్క్ లో నిర్వహించుకోవడం జరిగినది. ఈ క్యాంపును నిర్వహించడానికి స్టేట్ అధికారి డాక్టర్ ప్రమోదిని, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ గైడ్ , లీడర్ అఫ్ ద కోర్స్ గాను, గిరిజ లీడర్ ట్రైనర్ గైడ్, అడల్ట్ లీడర్, స్టాఫ్‌గా వ్యవహరించారు. ఇందులో సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ , పీజీ కళాశాలకు సంబంధించిన 24 మంది రేంజర్లు, ఐదుగురు రేంజర్ టీమ్ లీడర్లు హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని మొదట జెండా ఎగురవేయడంతో ప్రారంభించారు. ఈ క్యాంప్ లో రేంజర్స్ కి ప్రవేశ్, ప్రథమ సోపాన్, ద్వితీయ సోపాన్, తృతీయ సోపాన్ , నిపున్ సిలబస్ కి సంబందించిన అవగాహనపై లీడర్ అఫ్ ద కోర్స్ డాక్టర్ ప్రమోదిని శిక్షణ , పరీక్షను నిర్వహించారు. అలాగే ఏపీఆర్ఓ III పుస్తకం ని అనుసరించి, ఫస్ట్ ఎయిడ్, క్రాంప్ క్రాఫ్ట్, టెంట్ పిచింగ్, ఫెన్సింగ్, గాడ్జెట్ ప్రిపరేషన్, ప్రొఫిసీఎంసీ బ్యాడ్జ్‌లకు సంబంధించిన పలు అంశాలపై ప్రాక్టికల్ పరీక్షను నిర్వహించారు. ఈ క్యాంప్ కు విచ్చేసినటువంటి గౌరవ అతిథి కిరణ్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారు విచ్చేసి రేంజర్స్ను ఉద్దేశించి మాట్లాడుతూ నిపుణ్లో అత్యున్నత ప్రతిభ కనబరచాలని, అలాగే రాజ్య పురస్కార్, రాష్ట్రపతి అవార్డు వరకు చేరుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రాండ్ క్యాంప్ ఫైర్ కు ముఖ్య అతిథులుగా సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ గుండా




శ్రీనివాస్, వారి సతీమణి . శ్రీదేవి , పాల్గొని స్కౌటింగ్ పట్ల విద్యార్థుల్లో మరింత ఆసక్తిని కలిగించే విధంగా వారిని ప్రోత్సహిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చింత శారద , డిస్ట్రిక్ట్ కమీషనర్ గైడ్ విచ్చేసి మాట్లాడుతూ స్కౌటింగ్ గైడింగ్ యొక్క ఉద్దేశ్యం, యువతను శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా, భావోద్వేగపరంగా బలమైన , ఉపయోగకరమైన పౌరులుగా మార్చడానికి వారికి అనేక నిర్మాణాత్మక కార్యకలాపాలను అందించడం ద్వారా వారి స్వాభావిక సామర్థ్యాన్ని అభివృద్ధి చేయవచ్చని వెల్లడించారు. చివరగా ఈ క్యాంప్ సర్వమత ప్రార్థన, ఫ్లాగ్ లోవెరింగ్, జాతీయ గీతాలాపనతో ముగిసినది. ఈ శిబిరంలో ఎ ఎస్ ఓ సి సాయి నిరంజన్, జిల్లా సీనియర్ రోవర్లు గోపాల కృష్ణ , డెన్ మాస్టర్ వెంకట స్వామి పలు కార్యక్రమాల్లో వారి సహాయాన్ని అందించారు. ఇందులో సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ , పీజీ కళాశాలకు సంబంధించిన రేంజర్ టీమ్ లీడర్లు కె. ఆశాజ్యోతి, డాక్టర్ కె. రాజ్యలక్ష్మి, . పీ. విశాలిని, వి. రేణుక,కె స్వరూపరాణి హాజరైనారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్,సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా ఉంటా

* **బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కార్మికులకు అండగా ఉంటానని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం ప్రశాంత్ నగర్ ఇండస్ట్రీ ఏరియాలో "క్వాలిటీ ఇంజనీరింగ్ కంపెనీ" లో బాబర్ సింగ్ యాదవ్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసేవారు. కొన్ని అనివార్య కారణాలవల్ల క్వాలిటీ ఇంజనీరింగ్ కంపెనీలో మానేశారు. బాబర్ సింగ్ యాదవ్ అనే కార్మికుడికి గ్రాటీట్యూడ్ రూ.50,000 వేలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన కార్మికుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి బాబర్ సింగ్ యాదవ్ కు రావలసిన గ్రాడ్యుయేట్ రూ.50,000 వేలు ఇప్పించారు. కార్మికుడు బాబర్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్ , జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి కాంటాక్ట్ కార్మికుల జీతాలు పెంచాలి

- **కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ సమావేశం డిమాండ్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో కాంటాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది.సోమవారం కొత్తగూడెంలోని సిఐటియు కార్యాలయంలో రాసూరు శంకర్ అధ్యక్షతన సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుదల కోసం కాంట్రాక్ట్ కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా జేఏసీగా ఏర్పడి కృషి చేయాలని నిర్ణయించాయి. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుదల , వైద్య సదుపాయం, ఉద్యోగ భద్రత, తదితర డిమాండ్ల సాధన కోసం అసెంబ్లీ సమావేశాల్లోపుగా ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ తెలంగాణ జన సమితి అధ్యక్షులు సహకారంతో సింగరేణి యాజమాన్యాన్ని, ఇందన శాఖ మంత్రి భట్టి విక్రమార్క , ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డినీ కలిసి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలనీ ఏకాభిప్రాయానికి రావడం జరిగింది. సమస్యల పరిష్కారం కానట్లయితే మార్చి 25న ప్రజా భవన్ లో సామూహిక రాయబార కార్యక్రమాన్ని నిర్వహించాలని జేఏసీ నిర్ణయించింది. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు, టి యు సి ఐ రాష్ట్ర నాయకులు యాకూబ్ శావలి, ఇఫ్ట్ రాష్ట్ర నాయకులు ఎన్ సంజీవ్,తెలంగాణ జన సమితి కార్మిక సమైక్య రాష్ట్ర కన్వీనర్ మల్లెలరామనాథం, కో కన్వీనర్ వరదబోయన బాబు, ఐ ఎన్ టి సి రాష్ట్ర నాయకులు ఆల్బర్ట్, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు గడిపల్లి కృష్ణ ప్రసాద్, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్యా రమేష్, ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర నాయకులు కందగట్ల సురేందర్, కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

* **పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మదర్ డైరీ పాడి రైతులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని పాలు లీటరుకు నాలుగు రూపాయలు ప్రభుత్వ ప్రోత్సాహకం అందించాలని నిరసన వ్యక్తం చేసారు. మండలంలోని ప్రజలు ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి సకాలంలో పాల బిల్లులు రాకపోవడం వల్ల రైతులు నిత్యవసర వస్తువులు కూడా అప్పులు చేయవలసిన దుస్థితి ఏర్పడింది వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని రాజపేట మండల శాఖ డిమాండ్ చేశారు. బిజెపి రాజపేట మండల శాఖ అధ్యక్షులు మేకల రమేష్, మాజీ పాల చైర్మన్ గాండ్ల నర్సింగరావు, కంచర్ల శ్రీనివాసరెడ్డి, కోయ మధు, బూర్గు శేఖర్ రెడ్డి జెన్న సిద్ధులు గవ్వల సిద్ధేశ్వర్, అంకతి భాస్కర్, సోమసాని చంద్రమోహన్ తదితరులున్నారు. రాజపేట మిల్క్ చిల్లింగ్ సెంటర్ ముందు, తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసిన సందర్భంగా నినాదాలు చేశారు. పాడి రైతులను ఆదుకోకపోతే ఆందోళన ఉదృతం చేయనున్నట్లు హెచ్చరించారు.

## కష్టపడి చదువుకుంటేనే బంగారు భవిష్యత్

- **జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెదులుతూ కష్టపడి చదువుకుంటేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ముస్తాబాద్ జడ్పీహెచ్ఎస్ (బాలికలు) ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్ అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా డాక్టర్ రాజారాం పాఠశాలకు బహుకరించిన వాటర్ ప్లాంట్‌ను ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు చెడు మార్గాల్లోకి వెళ్తే భవిష్యత్ పూర్తి అంధకారమవుతుందని, జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైందని, అందులో పదవ తరగతి ఎంతో ముఖ్యమైందని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు రానున్న పరీక్షల్లో మంచి జిపిఎ సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీలు నిర్వహించిన డ్యాన్స్‌లు హోరెత్తించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీమతి, రాజ్ మహమ్మద్, వీరాస్వామి, రాజేంద్ర ప్రసాద్, జోష్ణ, ఎల్లారెడ్డి, జ్యోతి రాణి, శంకరయ్య, లక్ష్మణ్, గోవర్ధన్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యక్షులు రాజశేఖర్ ఉన్నారు.

## ఘనంగా అండే కార్ సురేందర్ కి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం



యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ప్రమాణస్వీకారం చేశారు. అండే కార్ సురేందర్ కి కాంగ్రెస్ పార్టీ నాయకులు హేరే కార్ శ్రీను ఆధ్వర్యంలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి వారికి ఘనంగా శాల్వతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి అన్ని కులాల వారిగా కష్టపడ్డ వారికి కాంగ్రెస్ పార్టీకి గెలుపుకోసం పనిచేసే ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి పదవులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు బోయిని బాలయ్య హీరే కారు గజానంద్ జమాల్పూర్ పాండు కాంగ్రెస్ పార్టీ నాయకులు లకంజి ఎండి కరీం తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ 163 అమలు చేస్తూ ఉత్తర్వులు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం కేంద్రంలోని జడ్పి హెచ్ఎస్ బాయ్స్, జడ్పి హెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ 163 అమలు చేస్తూ ముస్తాబాద్ తహశీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 2 ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఎవరూ గుమి కూడి ఉండవద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేందుకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివవేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు పేపరు వచ్చేటప్పుడు, పరీక్ష అనంతరం జవాబు పత్రాలు తీసుకొని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్ట్ ఉండాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలుంటాయని తెలిపారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం పాము కుంట గ్రామానికి చెందిన రంగా పాండు శ్రీలత కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, జల సాధన సమితి కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, టిఆర్ఎస్ మండల యువజన విభాగ అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, రంగ నరేష్, ఎండి కరీం, మాజీ ఎంపీటీసీ ఎడ్ల నరేష్ రెడ్డి, గజ్జల రాజు, ఎర్రోకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల విద్యాధికారి కార్యాలయం ప్రారంభం




మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : మేడిపల్లి మండల విద్యాధికారి నూతన కార్యాలయాన్ని సోమవారం మండల విద్యాధికారి జి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ ను మండల పిఆర్ టి యు టి ఎస్ అధ్యక్షులు ఇ.వెంకట్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి ఎ. అనిల్ కుమార్, పెద్ది దామోదర్ లు సత్కరించారు.




## అదిరిపోనున్న ఐపీఎల్2025 ఓపెనింగ్ సెర్మనీ

* **మార్చి 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్**
* **తొలి మ్యాచ్ లో కేకేఆర్ × ఆర్సీబీ**
* **ఈడెన్ గార్డెన్స్ లో ప్రారంభ వేడుకలు**

ఐపీఎల్ 18వ సీజన్ కు మరో ఐదు రోజుల్లో తెరలేవనుంది. మార్చి 22న ఐపీఎల్2025 పోటీలు గ్రాండ్ గా ప్రారంభం కానున్నాయి. టోర్నీ ప్రారంభ మ్యాచ్ లో డిఫెండింగ్ చాంప్ కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ ఈ మ్యాచ్ కు వేదిక. కాగా, ఈ మ్యాచ్ కు ముందు ఐపీఎల్ ప్రారంభోత్సవం కళ్లుచెదిరేలా నిర్వహించనున్నారు. బాలీవుడ్ తారలు శ్రద్ధా కపూర్, వరుణ్ ధావన్ తమ హై ఎనర్జీ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ తో అదరగొట్టనున్నారు. ప్రముఖ గాయకులు అరిజిత్ సింగ్, శ్రేయా ఘోషల్ కూడా తమ గానామృతంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించనున్నారు. కాగా, రెండు నెలల పాటు సాగనున్న ఐపీఎల్ పోటీలు మే 25న జరిగే ఫైనల్ తో ముగియనున్నాయి.

## తుఫాన్ పేట గ్రామస్తులతో వల్లభ పరిశ్రమ కార్మికుల వాగ్వాదం

* **మాజీ ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డితో ఘర్షణ పడ్డ పరిశ్రమ కార్మికులు**
* **పరిశ్రమ నుంచి నీటి శాంపిల్స్ సేకరించిన పిసిబి అధికారులు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తుఫ్రాన్ పేట గ్రామ పరిధిలోని వల్లభ మిల్క్ పరిశ్రమ కార్మికులు తుఫాన్ పేట గ్రామస్తులతో సోమవారం వాగ్వాదానికి దిగారు. వివరాల ప్రకారం.. వల్లభ మిల్క్ పరిశ్రమ వల్ల తుఫ్రాన్ పేట గ్రామ రైతుల పొలాలు పండక నష్టం జరుగుతుందని, పరిశ్రమ వదిలిన నీటిని పశువులు చనిపోతున్నాయని గత నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం విధితమే. సోమవారం ఉదయం పిసీబీ అధికారులు వల్లభ పరిశ్రమను తనిఖీ చేయడానికి పిసిబి అధికారులు వస్తున్నారన్న సమాచారం తెలియడంతో, గ్రామస్తులందరూ పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. గ్రామస్తులకు







కంపెనీలో పని చేసే వర్కర్లకు మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఒకరినొకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో స్థానిక మాజీ ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డి తో పాటు ఇరు వర్గాలకు గాయాలయ్యాయి. పరిశ్రమ ఎదుట ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఇరువురిని సద్దుమణిగించారు.

* **పరిశ్రమను తనిఖీ చేసిన పిసిబి అధికారులు**

వల్లభ మిల్క్ పరిశ్రమను పిసిబి ఈఈ వెంకన్న సోమవారం తనిఖీ చేశారు. పరిశ్రమలోని బోర్లను పరిశీలించారు. నీటి శాంపిళ్లను సేకరించారు. అదేవిధంగా పరిశ్రమ పరిసరాల్లోని మూడు బోర్ల నుంచి సైతం నీటి శాంపిళ్లను సేకరించారు. సేకరించిన శాంపిళ్లను పరిశ్రమలోనే గ్రామస్తుల ఎదుట సీల్ వేశారు. అనంతరం ల్యాబ్ కు తరలించారు.

## బీసీ రిజర్వేషన్లు.. రెండు బిల్లులకు తెలంగాణ శాసనసభ ఆమోదం

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులకు తెలంగాణ శాసనసభ ఆమోదం లభించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆమోదించింది. దీని ద్వారా విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే, రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును సైతం శాసనసభ ఆమోదించింది. బిల్లులు ఆమోదం పొందిన అనంతరం అసెంబ్లీ మంగళవారానికి వాయిదా పడింది.






## ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లేఖ

హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ప్రధానిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరుతూ సోమ వారం ఆయన లేఖ రాశారు. తెలంగాణలోని కాంగ్రెస్, భారాస, భాజపా, ఎంఐఎం, సీపీఐ ప్రతినిధులతో వచ్చి కలిసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు శాసనసభ ఆమోదించిన విషయాన్ని లేఖలో తెలిపిన సీఎం.. ఆ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కావాలని పేర్కొన్నారు. రాష్ట్రం లోని విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా తీసుకొచ్చిన రెండు బిల్లులకు తెలంగాణ శాసనసభ సోమవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

## డీలిమిటేషన్‌పై సమావేశాలు ఇంకా కొనసాగుతాయి

**: జానారెడ్డి**

హైదరాబాద్: డీలిమిటేషన్‌పై తెలం గాణ ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం ముగిసింది. అసెంబ్లీ కమిటీ హాలులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం ప్రతినిధులు హాజరు కాగా.. భాజపా, భారాస ప్రతినిధులు హాజరు కాలేదు. సమావేశం అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి మాట్లా డారు. ''డీలిమిటేషన్‌పై ఇలాంటి సమావేశాలు ఇంకా కొనసాగుతాయి. తమిళనాడు నిర్వహించే భేటీకి రాష్ట్ర ప్రతినిధుల బృందం వెళ్తుంది. అన్ని పార్టీల నుంచి ఒక్కొక్కరు సమావేశానికి వెళ్తారు. కొన్ని పార్టీల గైర్హాజరు తాత్కాలికమే.. భవిష్యత్‌లో అందరూ వస్తారు''అని తెలిపారు.



## జర్నలిస్టు రేవతి, తన్వి యాదవ్‌కు బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన వ్యవహారంలో అరెస్టు అయిన జర్నలిస్టు రేవతి, తన్వి యాదవ్‌కు బెయిల్ లభించింది. రూ.25 వేల పూచీకత్తుతో నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రతి సోమ, మంగళవారం విచారణకు హాజరుకావాలని కోర్టు వారిని ఆదేశించింది. 'నిప్పు కోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో సీఎంను తిడుతున్న వీడియో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని, పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను 'నిప్పుకోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేసినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసు దర్యాప్తు చేసి ఆ టీవీ ఛానల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా వీరికి నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.



## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం.. తితిదే అనుమతి

తిరుమల: తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వెల్లడించింది. ఈ మేరకు తితిదే ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆది, సోమవారం (సోమ, మంగళవారం దర్శనాలకు) మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపింది. బుధవారం, గురువారం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు (ఏ రోజుకు ఆ రోజే) లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేసింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే స్వీకరిస్తామని వెల్లడించింది. ఈ విధానం మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఏపీ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు స్వీకరిస్తున్నారు. ఇకపై శనివారం (ఆదివారం దర్శనం కోసం) స్వీకరించనున్నట్లు తితిదే పేర్కొంది. తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలు, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో పెట్టుకొని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని



ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని తిరుమల తిరుపతి దేవస్థానానికి సహ కరించాలని కోరింది.

## రైళ్లు ఆలస్యం.. విశాఖలో సమాచార కేంద్రం ఏర్పాటు

విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా విజయరామరాజుపేట వద్ద గిర్డర్‌ను లారీ ఢీకొట్టడంతో వంతెన కుంగిన నేపథ్యంలో విజయవాడ విశాఖపట్నం మార్గంలో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. గోదావరి, విశాఖ, సింహాద్రి, అమరా వతి, గరీబ్‌రథ్, మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు విశాఖ చేరుకోవడం ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో సమాచార కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. సమాచారం కోసం 0891 2746330, 0891 2744619, 87126 412 55, 77807 87054 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



## డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశం.. హాజరుకాని భాజపా, భారాస

హైదరాబాద్: డీలిమిటేషన్‌పై తెలంగాణ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. అసెంబ్లీ కమిటీ హాలులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం ప్రతినిధులు హాజరుకాగా.. భాజపా, భారాస ప్రతినిధులు హాజరుకాలేదు.





# ట్రూత్ సోషల్‌లో చేరిన ప్రధాని మోదీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రధాని మోదీ ఖాతా తెరిచారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. హౌడీ మోదీ' సందర్భంగా ట్రంప్‌తో దిగిన ఓ ఫొటోను పోస్ట్ చేశారు. 'ట్రూత్ సోషల్'లో చేరడం సంతోషంగా ఉందన్న మోదీ.. రానున్న రోజుల్లో అనేక మంది ఔత్సాహికులతో ఈ వేదిక ద్వారా సంభాషించేందుకు వేచి చూస్తున్నానని చెప్పారు. అంతకుముందు కృత్రిమ మేధ పరిశోధకుడు లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన వీడియోను అమెరికా అధ్యక్షుడు తన ట్రూత్ ఖాతాలో షేర్ చేశారు. అందుకు మోదీ స్పందిస్తూ.. ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపారు. అంతర్జాతీయ వ్యవహారాలు మొదలు భారత సాంస్కృతిక విశేషాలు, తన జీవిత ప్రయాణంతోపాటు అనేక విషయాలపై ఈ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడానని అన్నారు. ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో ట్రంప్ పాలన, ఆయనతో స్నేహం గురించి మోదీ మాట్లాడిన విషయం తెలిసిందే. జాతి ప్రయోజనాలే సర్వోన్నతమని తామిద్దరం భావిస్తామని, అందుకే ఇద్దరి మధ్య మంచి స్నేహం కొనసాగుతోందని మోదీ పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్‌నకు అమెరికా అభివృద్ధిపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉందన్నారు.

# ప్రధాని మోదీతో తులసీ గబ్బార్డ్ భేటీ



భారత పర్యటనలో ఉన్న అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్..ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉగ్ర వాదం, సైబర్ సెక్యూరిటీ వంటి ముప్పును ఎదుర్కోవడంలో సహకారం పెంపొందించే మార్గాలపై చర్చించినట్లు సమాచారం. సమావేశం సందర్భంగా గబ్బార్డ్‌కు మోదీ గంగా జలం అందజేయగా.. మోదీకి ఆమె రుద్రాక్ష మాల బహూకరించారు. గడిచిన రెండు నెలల్లో ప్రధాని మోదీతో గబ్బార్డ్ రెండోసారి భేటీ కావడం గమనార్హం. అంతకుముందు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో గబ్బార్డ్ సమావేశమయ్యారు. నిఘా సమాచారాన్ని పంచుకోవడంతోపాటు భారత్‌అమెరికా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. ఖలిస్థానీ ఉగ్ర సంస్థ సిక్కు ఫర్ జస్టిస్‌తో పాటు దాని వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూపైనా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ కోరారు. అనంతరం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌తో తులసీ గబ్బార్డ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# బంగారం స్మగ్లింగ్.. రన్యారావు సవతి తండ్రిని విచారించిన అధికారులు



దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ అరెస్టయిన కన్నడ నటి రన్యారావు అధికారుల కస్టడీలో ఉన్నారు. ఈ స్మగ్లింగ్‌లో ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.రామచంద్రరావు పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. తాజాగా ఆయనను అధికారులు విచారించారు. బంగారాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా తరలించేందుకు ఆమె తండ్రి ప్రమేయం ఉండే అవకాశం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించిన నివేదికను మరో రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. దీంతో అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఐఏఎస్ అధికారి గౌరవ్ గుప్తా నేతృత్వంలోని దర్యాప్తు బృందం ఆమె తండ్రిని విచారించింది. ఆయన వాంగ్మూలాన్ని అధికారులు రికార్డు చేశారు. ప్రస్తుతం ఆయన కర్ణాటక పోలీసు గృహమండలి మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. రామచంద్రరావును తప్పనిసరి సెలవుపై వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అధికారులు ఆయనను విచారించారు. కాగా.. నటి రన్యారావు దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ అధికారులకు దొరికిపోయారు. ఆమె బంగారం తరలించే సమయంలో విమానాశ్రయంలో వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భద్రతా తనిఖీలను తప్పించుకునేందుకు ఆమె తన సవతి తండ్రి పేరు వినియోగించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో రామచంద్రరావు పాత్ర ఏమైనా ఉందా అనే దానిపైనా దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ కేసు విచారణ అధికారిగా అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.




# పీఎం- ఇంటర్న్‌షిప్ స్కీమ్ యాప్ ఆవిష్కరణ

దిల్లీ: ఐదేళ్లలో టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు నైపుణ్యాలతో కూడిన ఉపాధి అవకాశాలు అందించే లక్ష్యంతో ప్రారంభించిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకం యాప్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం దిల్లీలో ఆవిష్కరించారు. ఇప్పటికే ఈ ప్రోగ్రామ్‌లో 300లకు పైగా దిగ్గజ కంపెనీలు భాగస్వాములు కాగా.. మరిన్ని కంపెనీలు ఇందులో చేరాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే, ఇందులో చేరి నైపుణ్యాలను పెంచుకొనేలా యువతను ప్రోత్సహించాలని ఎంపీలను కోరారు. 202425 ఆర్థిక సంవత్సరంలో 1.25లక్షల మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడమే లక్ష్యంగా గతేడాది అక్టోబర్ 3న ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించిన విషయం తెలిసిందే. దేశంలోని టైర్ 1, టైర్ 2 నగరాల నుంచి యువతను ఆకర్షించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను వారిలో కల్పించి ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేలా వారికి సహకరించడమే ఈ స్కీమ్ లక్ష్యమని నిర్మలా సీతారామన్ తెలిపారు. పరిశ్రమల అవసరాలకు తగిన సంఖ్యలో సిబ్బంది లేరని, ఆ అంతరాన్ని తగ్గించి యువతకు నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొనేందుకే ఈ స్కీమ్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. పీఎం ఇంటర్న్‌షిప్ వెబ్‌సైట్, యాప్‌లు ఎంతో బాగున్నాయని.. వేర్వేరు భాషల్లో యాక్సిస్ చేసుకోవచ్చన్నారు. ప్రతి భాషకూ తనదైన ప్రాముఖ్యత అనేది ఉంటుందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. అనంతరం కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయమంత్రి హర్ష్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఈ పథకం యువతకు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందిస్తుందని.. తద్వారా వికసిత్ భారత్‌కు తోడ్పడుతుందన్నారు. గతేడాది పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించిన ఈ స్కీమ్ మొదటి రౌండ్‌లో పలు కంపెనీలు 1.27లక్షలకు పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందించగా.. ప్రస్తుతం రెండో రౌండ్ ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ రౌండ్ కింద దాదాపు 337 కంపెనీల్లో 1.18 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నారు. ఈ ఇంటర్న్‌షిప్ స్కీమ్‌కు దరఖాస్తుల ప్రక్రియ మార్చి 31వరకు కొనసాగనుంది.

# వృద్ధురాలికి వీల్‌చైర్ నిరాకరణ.. ఎయిరిండియాకు నోటీసులు జారీ చేస్తాం: కేంద్రం




దిల్లీ: ఎయిర్‌పోర్ట్‌లో వీల్‌చైర్ సదుపాయం నిరాకరించడంతో ఇటీవల ఓ వృద్ధురాలు కింద పడిపోయిన సంగతి తెలిసిందే. గాయాలపాలైన ఆమె ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఈ ఘటనపై రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఎయిరిండియాకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సోమవారం సభలో వెల్లడించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ''దిల్లీ ఎయిర్‌పోర్టులో జరిగిన ఘటన బాధాకరం. పౌర విమానయాన మార్గదర్శకాల ప్రకారం.. ప్రతి ఎయిర్‌లైన్స్ అవసరం ఉంటే ప్రయాణికులకు వీల్‌చైర్ అందించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తున్నాం. అసలేం జరిగిందో తెలుసుకుంటాం. ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబంతో డీజీసీఏ మాట్లాడింది. అదే విధంగా విమానయాన సంస్థ నుంచి వివరణ స్వీకరించింది. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తున్నాం'' అని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఎయిరిండియాకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని.. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా.. ఇటీవల దిల్లీ ఎయిర్‌పోర్టులో ఓ వృద్ధురాలికి వీల్‌చైర్ సదుపాయం కల్పించకపోవడంతో నడుచుకుంటూ వెళ్లిన ఆమె కింద పడిపోయారు. గాయపడిన ఆమెకు చికిత్స అందుతోంది. ఈ విషయాన్ని ఆమె మనవరాలు పరుల్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వెల్లడించారు. దిల్లీ నుంచి బెంగళూరు వెళ్లేందుకు ఎయిరిండియా విమానంలో టికెట్‌తో పాటు వీల్‌చైర్‌నూ బుక్ చేసుకున్నామని తెలిపారు. అయితే, ఎయిర్‌పోర్టులో చక్రాల కుర్చీ ఇచ్చేందుకు ఎయిరిండియా సిబ్బంది నిరాకరించారని ఆరోపించారు. దీంతో ఆమె నడుచు కుంటూ రావడంతో ఒక్కసారిగా కిందపడిపోయారని వివరించారు.

# శిక్ష తప్పించుకోవడానికి 'హోదా'ను వాడలేరు: ఇంజినీర్ రషీద్ కేసులో ఎన్ఐఏ

ఉగ్రనిధుల కేసు నిందితుడు ఇంజినీర్ రషీద్ గత లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించినసంగతి తెలిసిందే. రిమాండ్‌ఖైదీగా ఉన్నఆయనశిక్షనుంచితప్పించుకోవడానికి తన హోదాను ఉపయోగించుకొనే అవకాశం ఇవ్వొద్దని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పేర్కొంది. లోక్‌సభ కార్యకలాపాలకు హాజరయ్యేందుకు తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ రషీద్ వేసిన పిటిషన్‌ను ట్రయల్ కోర్టు కొట్టివేసింది. ఆ తీర్పును సవాలు చేస్తూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు.

# బెంగాల్‌లో శాంతిభద్రతలు కరవయ్యాయి.. దీదీ పాలనపై సీఎం యోగి విమర్శలు



దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హోలీ సందర్భంగా బెంగాల్‌లో చోటు చేసుకున్న ఘర్షణలను ఆయన ఎత్తి చూపుతూ విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను సీఎం మమతా కాపాడుకోలేక పోయారంటూ ఎద్దేవా చేశారు. పండుగ రోజు బెంగాల్‌లోని బీర్భమ్‌లో రెండు వర్గాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై తాజాగా స్పందించిన సీఎం యోగి.. దీదీ పాలనను ఉద్దేశిస్తూ విమర్శలు చేశారు. ''ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభ మేళాలో తొక్కిసలాట ఘటనను ఉద్దేశిస్తూ ఇటీవల మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని మరణోత్సవమంటూ తక్కువ చేసి మాట్లాడారు. కానీ, ఆమె నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో జరిగిన రెండు వర్గాల మధ్య పోరును అడ్డుకోలేకపోయింది'' అని యోగి ఆదిత్యనాథ్ విమర్శల బాణాలు సంధించారు. ''మహాకుంభ మేళాలో మొత్తం 66 కోట్లకు పైగా మంది భక్తులు పాల్గొన్నారు. కానీ, ఒక్క నేరం కూడా జరగలేదు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించే సామర్థ్యం యూపీ ప్రభుత్వానికి ఉంది. కానీ, బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు ఇంకా జరుగుతున్నాయి. మా రాష్ట్రంలో హోలీని ఎంతో ఆనందంగా నిర్వహించాం. అయితే.. దీదీ ప్రభుత్వం మాత్రం పండుగల వేళ కర్ఫ్యూలు విధించే పరిస్థితి నెలకొంది. ప్రజలపై ఆంక్షలు విధిస్తుంటుంది. అయినప్పటికీ, నేరాలు నివారించలేకపోయింది. ప్రజల మనోభావాలను గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. పాలన అంటే విభజించడం కాదు. చెడు మనస్తత్వాలు కలిగిన వ్యక్తులతో కలిసి పని చేస్తే మంచి ఫలితాలు ఉండవు'' అని హితవు పలికారు. ఇదిలా ఉండగా.. హోలీ రోజున బెంగాల్‌లో రెండు వర్గాల ప్రజల మధ్య ఘర్షణ నెలకొంది. ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. 21 మందిని అరెస్టు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన యోగి.. దీదీ ప్రభుత్వంపై ఈ వ్యాఖ్యలు చేశారు.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి. అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.
- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబద్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

#### 1.ఆక్యుపేషనల్ థెరపీ:

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



#### 2.బిహేవియర్ థెరపీ:

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

#### 3. స్పీచ్ థెరపీ:

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.



# ఎండల్లో తప్పు చేయకండి!

**ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.**

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి

ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అద్వైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.





## నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతేకాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

## స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.

2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.



# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు



**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.

అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# టమాటాల నిల్వ ఇలా!





**టమాటాలను శుభ్రంగా కడిగి నీళ్లు లేకుండా తుడవాలి. ఆ తర్వాత వాటిని చిన్న చిన్న ముక్కలుగా తరిగి.. వాటిని ఒక మూకుడులో వేసి ఉడికించాలి. ఇలా ఉడికిన మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. దీనిలో తగినంత ఉప్పు, చక్కెర, వెనిగర్ వేసి కలపాలి. ఈ సాస్‌ను గాజు సీసాలో పోసి రిఫ్రిజరేటర్‌లో పెడితే చాలా కాలం నిల్వ**

లేత పసుపు రంగులో ఉన్న టమాటాలను సన్నని చక్రాలుగా కోసి ఎండలో పెట్టాలి. టమాటా ముక్కల్లో నీరంతా పోయి బాగా ఎండేలా చూసుకోవాలి. తరవాత వీటిని గాలి చొరబడని డబ్బాలో పోసి ఉంచుకుంటే నాలుగు నెలల వరకూ నిల్వ ఉంటాయి.

టమాటాలను బాగా ఉడికించి తొక్కలు తీసేయాలి. వీటిని మిక్సీలో వేసి బాగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌ట్రేలలో వేసి ఫ్రిజర్‌లో పెట్టాలి. ఇవి బాగా గట్టి పడిన తర్వాత జిప్‌లాక్ బ్యాగుల్లోకి మార్చుకోవాలి. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.





పచ్చి టమాటాలను నీటిలో కడిగి, తడి లేకుండా పల్చని గుడ్డతో తుడిచి.. జిప్‌లాక్ బ్యాగుల్లో వేసి ఫ్రీజర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటాయి.

టమాటాలను చిన్న ముక్కలుగా కోసి ఒక గాజు సీసాలో వేయాలి. ముక్కలు మునిగేవరకు ఆలివ్ ఆయిల్ పోయాలి. ఇందులో సన్నగా తరిగిన వెల్లుల్లి ముక్కలు, వెనిగర్ వేసి కలపాలి. వెనిగర్ వల్ల టమాటా ముక్కలు తాజాగా ఉంటాయి. ఈ ముక్కలను పాస్తా, వెజిటబుల్ సలాడ్, శాండ్‌విచ్‌ల తయారీలో వాడుకోవచ్చు.

దోరగా పసుపు రంగులో ఉండే టమాటాలను తెచ్చుకుని శుభ్రంగా కడిగి, తడి లేకుండా తుడవాలి. వీటిని సన్నని పొడవైన ముక్కలుగా కోయాలి. వీటిని బాగా ఎండబెట్టాలి. బాగా ఎండిన టమాటా ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేయాలి. ఈ టమాటా పొడిని గాజు సీసాలో పోసి మూత పెట్టి రిఫ్రిజరేటర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటుంది.





# విటమిన్ బి12 లోపం

## పురుష ఉద్యోగుల్లో 57 శాతం మందికి ఈ సమస్య.. జాగ్రత్త పడకపోతే..

**దేశంలోని నగరాల్లో ప్రజారోగ్య సమస్యలు సంక్షోభ స్థాయికి చేరుకుంటున్నాయి. పురుష కార్పొరేట్ ఉద్యోగుల్లో ఏకంగా 57 శాతం మందిలో విటమిన్ బీ12 లోపం ఉన్నట్టు ఓ సర్వేలో తేలింది. ఇక మహిళా ఉద్యోగుల్లో కూడా 50 శాతం మంది బీ12 లోపంతో బాధపడుతున్నారట. మొత్తం 4400 మందిపై (3338 పురుషులు, 1059 స్త్రీలు) మెడీబడ్డీ అనే సంస్థ జరిపిన అధ్యయనంలో ఈ షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగరాల్లో కార్పొరేట్ ఉద్యోగుల ఆహార అలవాట్లు, అధిక ఒత్తిడి వంటివి ఈ సమస్యకు దారితీస్తున్నాయని ఆ సంస్థ తేల్చింది. శరీరంలో ఎనర్జీ ఉత్పత్తికి, మెదడు పనితీరుకు, ఎర్రరక్త కణాల ఉత్పత్తికి అవసరమైన ఈ విటమిన్‌లోపంతో పలు సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, కొన్ని జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఈ సమస్యను సులువుగానే అధిగమించొచ్చని కూడా భరోసా ఇస్తున్నారు**

జంతు సంబంధిత ఉత్పత్తుల్లో విటమిన్ బీ12 సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి, మాంసాహారులు గుడ్లు, పాల ఉత్పత్తులు, చికెన్, చేపలు వంటివి తప్పనిసరిగా తినాలి. ఈ విటమిన్ ఉన్న ఫోర్టిఫైడ్ ఆహారాలను శాకాహారులు తీసుకోవాలి.

సోయా, బాదం, ఓట్స్‌తో చేసిన ఫోర్టిఫైడ్ ఉత్పత్తులు, న్యూట్రిషనల్ యీస్ట్ వంటివి వెజిటేరియన్‌లకు అనువుగా ఉంటాయి.

విటమిన్ బీ12 ఉన్న ఆహారాలు తిన్నంత మాత్రాన ఈ లోపం తీరదని కూడా నిపుణులు చెబుతున్నారు. జీర్ణక్రియలో లోపాలుంటే ఈ విటమిన్‌ను శరీరం సరిగ్గా గ్రహించలేదు. కాబట్టి, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు పెరుగు, ఇడ్లీ, దోస లాంటి పులియబెట్టిన ఆహారాలు, ఊరగాయ






పచ్చళ్లు వంటివి తప్పక తినాలి.

చక్కెరలు అధికంగా ఉండే కార్బోరేటెడ్ ఫుడ్స్, ఇతర ప్రాసెస్డ్ ఆహారాల జోలికి అస్సలు వెళ్లొద్దని నిపుణులు చెబుతున్నారు. వీటితో విటమిన్ బీ12 లోపం తలెత్తుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ ఆహారాలు పేగుల లోపలివైపు ఉన్న పొరను దెబ్బతీసి శరీరం విటమిన్ బీ12

గ్రహించడంలో ఆటంకాలు కలిగిస్తాయి. వీటి బదులు తృణ ధాన్యాలు, పండ్లు, ఇంట్లో వండిన ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి విటమిన్ బీ12తో పాటు ఐరన్, ఫోలేట్ కూడా అవసరం. ఒకదాంట్లో ఏర్పడే కొరత రెండో విటమిన్‌పై ప్రభావం చూపిస్తుంది. ఈ సమస్య నివారణకు ఆహారంలో పాలకూర, బఠాణీలు, బీన్స్,




బీట్‌రూట్, దానిమ్మ, బాదం పప్పులు వంటివి సమృద్ధిగా తినాలి. అవసరమనుకుంటే విటమిన్ బీ12 సప్లిమెంట్లు కూడా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

# ఒక్కరోజు నిద్ర తగ్గినా...

'ఒక్కరోజు నిద్రపోకపోతే ఏమవుతుంది?'... చాలామంది నిద్రని ఇలాగే తేలిగ్గా తీసుకుంటారు. శారీరక ఆరోగ్యం బాగుండాలంటే చక్కని ఆహార నియమాలు పాటిస్తూ, మంచి వ్యాయామం చేస్తే చాలనుకుంటారు... కానీ వీటితోపాటూ మంచి నిద్రకూడా ముఖ్యమేనంటోందీ పరిశోధన. కువైట్‌లోని డాస్‌మేన్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూట్ విశ్రాంతికీ, దీర్ఘకాలిక వ్యాధులకూ ఉండే సంబంధంపైన పరిశోధన చేసింది. మనం నిద్ర పోకుండా ఉన్నప్పుడు మెదడు మనం ఒత్తిడిలో ఉన్నామేమో



అనుకుంటుంది. దాన్ని తగ్గించడానికి కార్టిసాల్ అనే హార్మోన్‌ని మామూలు కన్నా ఎక్కువగా విడుదల చేస్తుంది. ఇలా 'ఒక్కరోజే కదా' అని సర్దిచెప్పుకుంటూ మనం పదేపదే నిద్రకు దూరమవుతూ ఉన్నప్పుడు శరీరంలో కార్టిసాల్ ఎక్కువగా జమవుతూ చివరికి శరీరంలో కొన్ని వాపులకి కారణం అవుతుంది. మరోపక్క నిద్రలేమితో కణాలు శక్తిని కోల్పోయి... ఇన్‌ఫెక్షన్లతో పోరాడే గుణాన్ని కోల్పోతాయి. దాంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఈ మొత్తం పరిస్థితిని చక్కదిద్దడానికి శరీరం మోనోకైట్స్ అనే వ్యాధినిరోధక కణాలని విడుదల చేస్తుంది. ఈ పరిస్థితీ పదేపదే కొనసాగితే శరీరంలో



ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతూ వచ్చి ఊబకాయం, గుండెజబ్బులతోపాటూ ఇతర దీర్ఘకాలిక సమస్యలు రావొచ్చట. అందుకే పని ఒత్తిడీ, వారాంతం పార్టీలు అనే సాకులు చెప్పకుండా తగినంత విశ్రాంతి తీసుకోవడం అవసరం అంటుందీ పరిశోధన.



# హీరోలతో పోటీ పడుతున్న నేషనల్ క్రష్.. ఎందులో అంటే..!

రష్మిక మందన్నా ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఈ భామ హీరోయిన్‌గా చేస్తున్న ప్రతి సినిమా బాక్సాఫీస్ భారీ కలెక్షన్స్ రాబడుతున్నాయి. ఇటీవలే వచ్చిన "పుష్ప 2", "చావా" సినిమాలు భారీ విజయం కావడంతో ఈ భామ మంచి జోష్‌లో ఉంది. అలాగే రష్మిక మందన్నా యూత్ లో మంచి క్రేజ్ ఉంది.. రష్మిక ను అందరూ నేషనల్ క్రష్ అని పిలుస్తారు. అయితే తాజాగా రష్మిక రెమ్యూనరేషన్ అని పెంచేసింది అని టాక్ నడుస్తుంది. ప్రస్తుతం ఈ భామ అట్టు తెలుగు, హిందీలో సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. రష్మిక మందన్నా సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న "సికిందర్" సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. అయితే ఈ సినిమాకి దాదాపు రూ. 5 కోట్లు తీసుకుంటుంది అని సమాచారం. అయితే సికిందర్ సినిమా తరువాత ఇకపై చేసే సినిమాలకు రష్మిక భారీ రెమ్యూనరేషన్ డిమాండ్ చేస్తుంది అని సినీ వర్గాలు అంటున్నాయి. ఇకపై చేయబోయే సినిమాలకు రష్మిక 8 నుండి 10 కోట్లు డిమాండ్ చేస్తుంది సమాచారం. ఈ క్రమంలో నిర్మాతలు కూడా అడిగినంత ఇవ్వడానికి రెడీగా ఉన్నారు. అయితే రష్మిక రెమ్యూనరేషన్ ఒక మిడ్ రేంజ్ హీరో తీసుకునే అంత ఉంది అని నెటిజన్స్ అంటున్నారు. ప్రస్తుతం రష్మిక రెమ్యూనరేషన్ సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.




# 'సారంగపాణి జాతకం' చెప్తానంటున్న ప్రియదర్శి

కామెడీ యాక్టర్‌గా టాలీవుడ్‌లోకి అరంగేట్రం ఇచ్చిన ప్రియదర్శి.. ప్రస్తుతం హీరోగా మారాడు. నటనకు ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకుంటూ, అందులో లీడ్ రోల్‌లో ఒదిగిపోయి నటిస్తున్నాడు. ప్రియదర్శి నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. బలగం సినిమాతో మెయిన్ క్యారెక్టర్‌లు చేయడం మొదలు పెట్టిన ప్రియదర్శి.. తాజాగా కోర్ట్ మూవీతో బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు రాబట్టడమే కాకుండా ప్రేక్షకుల్లోనూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రియదర్శి రెడీ అవంటున్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు ప్రియదర్శి మీద అందరికీ నమ్మకం పెరిగింది. రొటీన్ రొట్టకొట్టుడు సినిమాలు చేయకుండా ప్రేక్షకుల మనసెరిగిన కథలు ఎంచుకుంటున్నాడు. బలగం, కోర్టు సినిమాలే ఇందుకు ఉదాహరణ. ఇప్పుడు సారంగపాణి జాతకం అనే సినిమాతో రాబోతున్నాడు.

మోహనకృష్ణ ఇంద్రగంటి డైరెక్షన్ లో వస్తుండటంతో అంచనాలు బాగా పెరిగాయి.

సోమవారం ఈ సినిమా రిలీజ్‌డేట్‌ను ప్రకటించింది మూవీ టీమ్. ఏప్రిల్ 18న 'సారంగపాణి జాతకం'ను అందరి ముందు ఉంచనున్నట్లు వెల్లడించింది.

అయితే ఈ రిలీజ్ డేట్‌ను ముందుగా స్టార్ హీరోయి అనుష్క నటిస్తున్న 'ఘాటి'కి ఫిక్స్ చేశారు. కానీ మూవీ పోస్టు ప్రొడక్షన్ పనులు ఇంకా చాలానే ఉన్నాయి. పైగా క్రిష్ కు అటు హరిహర వీరమల్లు సినిమా పనులు కొన్ని ఇచ్చారని టాక్. అందుకే ఈ మూవీ వెనకబడింది.

చేసేది లేక వాయిదా వేయాలని ఫిక్స్ అయ్యారంట. రేపో, మాపో అధికారికంగా అనౌన్స్ చేయబోతున్నారు. ఘాటీ తప్పుకోవడంతో ప్రియదర్శి ఛాన్స్ వదులుకోకుండా లైన్ లోకి వచ్చాడు. కోర్టు మూవీ హిట్ తో ట్రెండింగ్ లో ఉన్నాడు కాబట్టి సారంగపాణికి ఆటోమేటిక్ గా ప్రమోషన్ అవుతోంది. పెద్దగా కష్టపడకుండానే ఆ మూవీ జనాల్లోకి వెళ్లిపోతోంది. అనుష్క వదిలేస్తే ప్రియదర్శికి ఇలా కలిసొచ్చిందన్నమాట.



# సినిమాలకు ప్రభాస్ గుడ్‌బై..!

ప్రస్తుతం ఇండియాలోనే ఏ హీరో లేనంత బిజీగా ప్రభాస్ ఉన్నాడు. ప్రభాస్ చేతిలో 5 సినిమాలు ఉన్నాయి. "రాజాసాబ్", "ఫౌజీ" సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. అలాగే "సాలార్ 2", "స్పిరిట్", "కల్కి 2" సినిమాలు షూటింగ్ ఇంకా మొదలు కాలేదు. అయితే ఈ సినిమాలు అన్ని పూర్తి అవ్వడానికి దాదాపు నాలుగు నుండి ఆరు ఏళ్ళు పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ ఒక షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడని సినీ వర్గాల్లో టాక్ నడుస్తుంది. ప్రస్తుతం చేస్తున్న సినిమాలు అని పూర్తి చేసి ఆ తరువాత సినిమాలకు గుడ్ బై చెప్పాలని ప్రభాస్ ఆలోచిస్తున్నాడు అని సమాచారం. ఎందుకంటే ఇటీవలే ప్రభాస్ ఆరోగ్యా పరిస్థితి బాగ క్షిణించింది అని తెలిసిన విషయమే.. అయితే ప్రభాస్ ప్రస్తుతం ఇటలీలోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుంటున్నాడు. అందుకే కొన్ని ఏళ్ల పాటు రెస్ట్ తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ఈ క్రమంలోనే ఇప్పటికే మొదలు కావలిసిన "స్పిరిట్" సినిమా షూటింగ్ కూడా వాయిదా వేశారు. తిరక లేకుండా వరుసగా సినిమాలు చేయడంతో ప్రభాస్ బాగా అలసిపోయాడు అని.. అందుకే కొన్ని ఏళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండలని నిర్ణయం తీస్కున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న షూటింగ్ దశలో ఉన్న సినిమాలు పూర్తి చేసి ఆపై కొన్నాళ్లపాటు సినిమాలు చేయకూడదు అని ప్రభాస్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# ఇన్‌ఫ్లూయన్సర్లపై కేసులు నమోదు..!






బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న నటీనటులు, ఇన్‌ఫ్లూయెన్సర్ల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. వీటిని ప్రమోట్ చేయడం నేరమని తెలిసినా.. కొందరు డబ్బుల కోసం వీటిని ప్రమోట్ చేస్తున్నారు.

తాజాగా వీరిపై పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఇమ్రాన్‌ఖాన్, హర్షసాయి, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, శ్యామల, రీతూ చౌదరి, సుప్రీత, అజయ్, సన్నీ యాదవ్, సందీప్‌లపై బీఎన్ఎస్ 318(4) 3, 3ఏ, టీఎస్‌జీఏ, 66డీఐటీఏ2008 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

ఈ బెట్టింగ్ యాప్‌ల కారణంగా అనేక మంది లక్షల రూపాయలు కోల్పోగా.. మరికొందరు ప్రాణాలు సైతం వదులారు.

ఈ క్రమంలోనే కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో పెద్ద యుద్ధమే జరుగుతుంది. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అనేక మంది డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా వీటిని ప్రమోట్ చేయడాన్ని వాళ్లు డిఫెండర్ కూడా చేసుకుంటున్నారు. దీనికి తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ వీసీ సజ్జనార్ సైతం మద్దతు పలికారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసే వారిని అన్‌ఫాలో చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పలువురు బెట్టింగ్ యాప్స్‌ని ప్రచారం చేసిన వారంతా.. ఇప్పుడు తమ వీడియోలను తొలగిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.